క్లుప్తంగా

బాలిక కీమో థెరపీకి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం పల్లమల్లి గ్రామానికి చెందిన వల్లెపు రోజా అనే వితంతుకి ముగ్గురు పిల్లలు. రెండవ కుమార్తె గ్రీష్మతికి కుడి కంటిలో క్యాన్సర్ వచ్చింది. ఈ బాలికకు (రెటినో బ్లాస్టోమా) ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వారు ఉచితంగా ఆపరేషన్ చేశారు. కీమో థెరపీ వైద్య అవసరాల కోసం రూ.25 వేలు అవసరం కాగా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి మహం కాళరావు (ఎన్ఆర్ఐ) వెంటనే స్పందించి నగదు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. నగదు సాయాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ చేతుల మీదగా బాలిక కుటుంబానికి బుధవారం కలెక్టరేట్‌లో అందించారు.

నర్శింగపాడులో పంటకోత ప్రయోగం



నకరికల్లు: రబీ సీజన్‌లో వరి దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని నర్శింగపాడులో బుధవారం వరి పంట కోత ప్రయోగం చేశారు. గ్రామంలోని ఆవుల వెంకటశివారెడ్డి పొలంలో పంటకోత ప్రయోగం చేశామన్నారు. వరి ఏపీ 567 రకం 25 చదరపుమీటర్ల విస్తీర్ణంలో కోత నూర్పిడి చేశామన్నారు. నూర్పిడి చేసిన గింజలను తూకం వేయగా 17కేజీల 90 గ్రాములు వచ్చిందన్నారు. దీనిని బట్టి ఎకరాకు 33బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు జాన్ అహ్మద్, రవి, జగదీష్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



క్రోసూరు: అభాగ్యులకు అండగా నిలిచే ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.2 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అందజేశారు. మండలంలోని 88త్యాళ్లూరుకు చెందిన నల్లగొర్రెల లక్ష్మయ్య అనారోగ్యానికి గురై మరణించటం జరిగింది. భర్త మృతి చెందటంతో భార్య వెంకాయమ్మ కుటుంబపోషణ కష్టమై అవస్థలు పడుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరరావు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం అందేలా చేశారు. వెంకాయమ్మకు రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలి

నకరికల్లు: రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిలింగం అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా దళిత బహుజన రిసోర్స్‌సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీలో బుధవారం రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం మానవహక్కులను కాపాడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థినులకు రాజ్యాంగం ఆమోదం, ప్రవేశిక అను అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

పెన్షనర్స్ గదులు ఖాళీ చేయాలని ఆదేశించిన తహసీల్దార్

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ గదులను తక్షణమే ఖాళీ చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ చేపట్టిన ఆందోళన బుధవారం 8వ రోజుకు చేరింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు రామారావు, జక్కుల లక్ష్మీ నారాయణ, లీజ్ దారుడు జవ్వాజి సాంబశివరావులతో మాట్లాడారు. తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ పెన్షనర్స్ గదులు ఎందుకు ఖాళీ చేయడం లేదని ప్రశ్నించారు. ఒప్పందం ప్రకారం లీజ్ గడువు పూర్తయిందని, తక్షణమే ఖాళీ చేయాలన్నారు. మానవతా దృక్పథంతో గౌరవంగా ఖాళీ చేయాలి తప్ప హక్కులా భావించి పెన్షనర్లను రోడ్డెక్కాలా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యేరువ ప్రతాపరెడ్డి, అసోసియేషన్ బాధ్యులు రొంపిచర్ల పురుషోత్తం, నరసింహారావు, గద్దె మురహరిరావు, శృంగారం, లక్ష్మీనారాయణ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం జగన్ కావాలి

- గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ
- పట్టణంలోని 14వ సచివాలయంలో అట్టహాసంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

సత్తెనపల్లి: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు పట్టణంలోని 11,12 వార్డులకు సంబంధించి 14వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే అందరి జీవితాలు బాగుపడతాయన్నారు. ఒక్క 14వ సచివాలయం పరిధిలోని 11,12 వార్డులకు నాలుగున్నర ఏళ్లలో రూ.19,58,45,008 అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆయనకు అండగా నిలవాలన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ నిరుపేదలకు స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు కట్టిస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పట్టాల పంపిణీలో కూడా రాజకీయం చేసి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ముందుగా అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం వార్డులో బస చేసేందుకు ఉపక్రమించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, 11,12 వార్డుల కౌన్సిలర్లు గుజ్జర్లపూడి సతీష్, లోకా కళ్యాణి, జేసీఎస్ ఇన్‌చార్జ్ కొణతం స్వాతి, నాయకులు లోకా మాధవ, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జునరెడ్డి, తిరుమలరావు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అందుకూరులో...

క్రోసూరు: నవరత్నాల హామీలు నూటికి నూరు శాతం నెరవేర్చేది ఒకే ఒక్క నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఇంటింటికీ వెళ్లి చెబుదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని అందుకూరు, బాలెమర్రు సచివాలయ పరిధిలోని అందుకూరు ఎస్సీకాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శంకరరావు నేతృత్వంలో సంక్షేమ ఫలాలు, జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. అందుకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఎస్సీకాలనీలో పల్లెనిద్ర చేపట్టారు. ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫార్, సయ్యద్ అబ్దుల్‌రహీం, నాయకులు అప్పిరెడ్డి, వీరభద్రం, గ్రామ కన్వీనర్ రోశయ్య, బాలెమర్రు గ్రామ కన్వీనర్ రవి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, డేవిడ్, శ్రీను, రామయ్య, బాబు పాల్గొన్నారు.



పట్టణంలోని 14వ సచివాలయంలో సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన నిమ్మకాయల, డాక్టర్ గీత హాసంతి, చల్లంచర్ల



పెదనెమలిపురిలో ఇంటింటా కరపత్రాలను అందిస్తున్న మిర్చి యార్డు చైర్మన్, నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాజుపాలెం: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ తెలిపారు. మండలంలోని పెదనెమలిపురిలో మంగళవారం రాత్రి బస చేసిన ఆయన బుధవారం ఉదయం ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను అందుకుంటున్న లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ వెంకాయమ్మశ్రీనివాసరావు, ఎంపీపీ రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సునీతశ్రీనివాసరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ పాల్గొన్నారు.

అమరావతిలో పల్లెకుపోదాం

అమరావతి: ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెకు పోదాం కార్యక్రమం అమరావతి గ్రామ సచివాలయం–1లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ప్రారంభించి సచివాలయంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో రూ.46.99 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా, రూ.6.22 కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు హనుమంతరావు, గ్రామ సర్పంచ్ పి.రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు ఈవోపీఆర్డీ గంగాధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్సూర్, శివశంకర్ గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ ముందంజ

నకరికల్లు: సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజలో ఉందని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లి–1లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. డీబీటీ ద్వారా 9,022 మందికి రూ.26,03,53,771, నాన్ డీబీటీ ద్వారా 3,871 మందికి రూ.8,79,63,297 లబ్ధి చేకూరిందని అన్నారు. జేసీఎస్ కన్వీనర్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, ఉపసర్పంచ్ జూపల్లి మోషె, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు రేమిడిచర్ల ఖాశిం, పాశం పాపిరెడ్డి, పమ్మి రామకృష్ణారెడ్డి, పాశం ముత్యాలరెడ్డి, సచివాలయ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాలంటే జగనే రావాలి

సత్తెనపల్లి: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెట్టాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా రావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు అన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో పేదల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థతో పాటు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామంలోనే రైతుల అవసరాలను తీరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముందుగా నాలుగున్నరేళ్లలో రూ.42,42,42,417తో జరిగిన అభివృద్ధి, సంక్షేమ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో బస చేసేందుకు ఉపక్రమించారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు అన్నదాసు శ్రీనివాసరావు, సర్పంచ్ గండు పద్మావతి, జేసీఎస్ ఇన్‌చార్జ్ బొంతు వెంకటరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్, మండల నాయకుడు సంకటి శ్యాంసన్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు చందూ సాంబశివరావు, నాయకులు కొండలు, సుబ్బారావు, దేశిబాబు, రాఘవరావు, నర్శిరెడ్డి, రాంబాబు, నాగేశ్వరరావు, జగదీష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యకర్తలు ఉన్నారు.

అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనే రావాలి

బెల్లంకొండ: రాష్ట్రంలో అభివృద్ధి నిర్విరామంగా జరగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తేనే సాధ్యపడుతుందని ఎంపీపీ చెన్నుపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కందిపాడు గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ సచివాలయంలో నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సూచిక బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామ నాయకులతో కలసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కొనసాగాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఎంపీడీవో వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ కంభంపాటి పాప, ఎంపీటీసీ రేగులగడ్డ తిరుపతమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ భద్రయ్య, సాయిరెడ్డి, ప్రసాదరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, రేగులగడ్డ శ్రీను, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



అందుకూరులో సంక్షేమం, అభివృద్ధి వివరాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



అమరావతి సచివాలయం-1లో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



గుండ్లపల్లిలో సంక్షేమ, అభివృద్ధి పథకాలబోర్డును ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే యర్రం, వైస్ ఎంపీపీ



బృగుబండలో సంక్షేమ, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పక్కాల సూరిబాబు, కళ్ళం



కందిపాడులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు

రైతులందరం సంతోషంగా ఉన్నాం



నకరికల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులందరూ గిట్టుబాటు ధరతో సంతోషంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నర్శింగపాడు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే పుస్తకాలను పంపిణీ చేశారు. పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి వారి వ్యవసాయ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా వస్తుందా...? రాయితీ విత్తనాలు ఆర్బీకేల్లో ఇస్తున్నారా...? వ్యవసాయ శాఖ సిబ్బంది ఈ–కేవైసీ, ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారా..?, పండించిన పంటలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారా..? తదితర ప్రశ్నలను రైతులను అడిగారు. పలువురు రైతులు సమాధానమిస్తూ ఇటీవల శనగవిత్తనాలు 40శాతం రాయితీపై గ్రామంలో పంపిణీ చేశారన్నారు. దేవుని దయతో రబీ సీజన్‌లో ఎకరాకు వరి 40 బస్తాల దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం రబీ వరి 75 కేజీల బస్తాకు రూ.2000 వస్తుందని సంతోషంగా ఉన్నామని సమాధానమిచ్చారు. అనంతరం గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, సర్పంచ్ సంగు రామకోటమ్మ, సంగు శివారెడ్డి, ఉపసర్పంచ్ రొండా రామ్మోహన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరి పంటలో కేళీలను గుర్తించి ఏరివేయాలి

వ్యవసాయ ఉప సంచాలకులు శివకుమారి

అచ్చంపేట: వరి పంటలో కేళీలను గుర్తించి ఏరివేయాలని, తెగుళ్ల నివారణకు ప్రొపికొనజోల్ 2ఎంఎల్ లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలని వ్యవసాయ ఉప సంచాలకులు ఎం.శివకుమారి రైతులకు సూచించారు. మండలంలోని తాడువాయి, చల్లగరిగ గ్రామాలలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వరి, మిరప పంటలను పరిశీలించి అధిక దిగుబడులకు తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జి.రమేష్ మిరప పంటలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మిరప పంట ప్రారంభ దశలో భాస్వరం వాడటం వల్ల ఉపయోగం ఉండదని, అనవసర ఖర్చులు పెంచుకోవద్దని సూచించారు. క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు తెగుళ్లను యాజమాన్య పద్ధతుల ద్వారా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవీ పి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారులు శివానాయక్, లక్ష్మీశైలజ, మన్యనాయక్, రహీమ్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తాడువాయిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రజక ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రజక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 26న నిర్వహించే రజక ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ఆవిష్కరించారు. పెదకూరపాడు నియోజకవర్గ రజక సంఘ నాయకుడు వాడపర్తి పుల్లయ్య మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు గుంటూరు–విజయవాడ జాతీయ రహదారి పక్కన, నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా వీరనారి చిట్యాల ఐలమ్మ గారి ప్రాంగణంలో ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.



రజక ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, తదితరులు

నేడు దిడుగు అభయాంజనేయస్వామి ప్రతిష్ట మహోత్సవాలు

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామంలో అభయాంజనేయస్వామి వారి నూతన విగ్రహ, జీవధ్వజాలతో పాటుగా గణపతి, నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించటానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతిష్టలో భాగంగా బుధవారం యాగశాలలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, దీక్షధారణ, అఖండస్థాపన, ఋత్విక్‌వరణ, యంత్రానుష్టానం, మంగళస్నానం, మూలవిరాట్‌లకు అలంకరణ నిర్వహించారు. సాయంత్రం యాజ్ఞికబ్రహ్మ నారాయణం రఘురామ్ ఆధ్వర్యంలో వేదపండితులచే యాగశాల ప్రవేశం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపన అనంతరం నూతన విగ్రహాలు, ఆలయశిఖర జలాధివాసానంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటల 55 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన, కుంభసంప్రోక్షణ తర్వాత స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులందరికి అన్నదానం నిర్వహిస్తారు.



జలాధివాసానికి సిద్ధం చేసిన స్వామివారి విగ్రహాలు

నేడు వైఎస్సార్ జలకళ పరికరాల పంపిణీ

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ జలకళ పథకం కింద వేసిన బోర్‌వెల్స్‌కు సంబంధించి విద్యుత్ మోటారు, సోలార్ పరికరాలను గురువారం మధ్యాహ్నం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావలసినదిగా కోరారు.

ఏకగ్రీవంగా యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

అచ్చంపేట: యూటీఎఫ్ (యునైటెడ్ టీచర్స్‌ఫెడరేషన్) అచ్చంపేట మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలో జిల్లా కార్యదర్శి కె.ప్రకాశరావు అధ్యక్షతన యూటీఎఫ్ సభ్యులు సమావేశమయ్యారు. అధ్యక్షులుగా ఆళ్లమూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ సుభాని, గౌరవాధ్యక్షులుగా తుమ్మా శౌరైడ్డి, సహ అధ్యక్షురాలిగా వాసవికన్యక, ట్రెజరర్‌గా సీహెచ్ పూర్ణచంద్రరావు, కార్యవర్గ సభ్యులుగా సీవాచ్ భార్గవ్, జి.బాలశౌరైడ్డి, కె.నాగేశ్వరరావు, సీహెచ్ రమేష్, పి.సుజాత, షేక్ మస్తాన్‌వలి, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా నిర్మలమేరి, సీపీఎస్ కన్వీనర్‌గా యు.సత్యనారాయణ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల సహకారంతో ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు వచ్చే విధంగా, బకాయిలు ఇప్పించే విధంగా కృషిచేస్తానని చెప్పారు.

బాలికల హక్కులను కాపాడాలి

అమరావతి: సమాజంలో ప్రతిఒక్కరు బాలికల హక్కులను కాపాడే బాధ్యత తప్పని సరిగా తీసుకోవాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. బుధవారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమానికి ఎంఈవో శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాలికలకు పోషకాహారాన్ని అందించటడమే కాకుండా బాల్యవివాహాల నివారణకు, బాలికల హక్కుల రక్షణకు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి బాలిక దిశ యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ పి.రాజేశ్వరి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు ఇమాంబి, భారతీదేవిలతో పాటు మహిళాపోలీసులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాలల చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

సత్తెనపల్లి: బాలల చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పారాలీగల్ వలంటీర్ షేక్ సుభానీ అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డీ నాగ వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో వీధి బాలలు వారి యొక్క సంరక్షణ బాధ్యత, చట్ట పరమైన హక్కులు, న్యాయ సేవాధికార చట్టం యొక్క ప్రాముఖ్యతలపై బుధవారం నిర్వహించిన సదస్సులో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు షేక్ ముబారక్, మహిళ పోలీస్ భాగ్యలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

క్రోసూరు: మండలంలోని ఆవులవారిపాలెం గ్రామంలో ఏడు కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన చూసి గ్రామాల్లో ఇతర పార్టీల కార్యకర్తలు, ప్రజలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో గోపుసారయ్య, వల్లాల సూరిబాబు, తోకల కొండలరావు, తిరుమళ్ల అంజయ్య, కవ్వాల సుబ్బారాయుడు, వేల్పుల జంపారావుతో పాటు వారి కటుంబసభ్యులు ఉన్నారు.



ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆవులవారిపాలెం టీడీపీ కార్యకర్తలు

నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితాను పరిశీలించాలి

రాజుపాలెం: తప్పులు, తడకలు లేకుండా నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితాను పరిశీలించాలని సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ఆర్‌ఆర్ సెంటర్‌లో ఆర్డీవో ఓటర్ల జాబితాను బుధవారం పరిశీలించారు. ఆర్‌ఆర్ ఒకే డోర్ నెంబర్‌తో 10కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉన్నవి ఆర్డీవో పరిశీలించారు. అలా ఓట్లు కలిగి ఉన్న వారికి తెలియపరిచి, పరిశీలించిన తరువాత ఓటును తొలగించడమా, ఉంచడమా నిర్ణయం తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు నళిని, వీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.

రైతులు జీవన ఎరువుల వాడకం పెంచాలి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): రసాయన ఎరువుల వాడటం ద్వారా భూసారం దెబ్బతినకుండా ఉండేందుకు గాను జీవన ఎరువులు వాడకం పెంచాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త వరప్రసాద్ చెప్పారు. మండలంలోని ఇరుకుపాలెంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ట్రైకోడెర్మావిరిడీ వలన కలిగే ప్రయోజనాలపై బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువుల ఎరువులో ట్రైకోడెర్మావిరిడీ కలిపి నేలలో చల్లడం వలన తెగుళ్లను నిరోధించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు.